ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కరీంనగర్ f : fb.com/vaartha

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-10-2024 సోమవారం సంపుటి: 30 సంచిక: 263 పేజీలు: 8+16 వెల: 6.50

దిగ్గజ నేతలందరూ తొలి జామితాలోనే..

స్లీపర్ బస్, ఆటో ఢీ: 12 మంది మృతి

5



హైదరాబాద్ ఐఎస్‌బిలో ఆదివారం లీడర్‌షిప్ సమ్మిట్-2024లో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్

# మన లక్ష్యం ట్రిలియన్ డాలర్ ఎకానమీ

## జీవితంలో లక్ష్యాలను చేరుకోవాలంటే రిస్క్ తప్పదు

## హైదరాబాద్‌ను గ్లోబల్ లీడర్ చేయడమే లక్ష్యం

## ఐఎస్‌బి లీడర్‌షిప్ సమ్మిట్‌లో ప్రసంగించిన సిఎం రేవంత్

**హైదరాబాద్ (గచ్చిబౌలి), అక్టోబరు 20 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ ఎకానమిగా నిలుపడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఈ లక్ష్యం సాధించాలంటే కీలకమైన హైదరాబాద్ నగరాన్ని 600బిలియన్ సిటీగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే కొంత రిస్క్ తీసుకోక తప్పదని, రిస్క్ తీసుకోకుండా లక్ష్యాలను చేరుకోలేమని అన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బి)లో ఆదివారం నిర్వహించిన లీడర్‌షిప్ సమ్మిట్-2024లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీడర్‌షిప్ ఇన్ న్యూ ఇండియా అంశంపై ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎస్‌బి విద్యార్థులు తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లని, విద్యార్థులు ఇతర ప్రదేశాలకు వెళ్లినప్పుడు అక్కడి ఇన్వెస్టర్లు, వ్యాపారవేత్తలు, ప్రజలతో తెలంగాణ, హైదరాబాద్‌ల అభివృద్ధిపై చర్చించాలన్నారు. ఐఎస్‌బితో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని, పెద్దమొత్తంలో వేతనాలు ఇవ్వలేకపోయినా, ఉత్తమ అవకాశాలను కల్పిస్తామని అన్నారు. తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుపడమే తన లక్ష్యమని, తెలంగాణ క్రీడాకారులు ఒలంపిక్స్‌లో గోల్డ్‌మెడల్స్ సాధించడమే తన ధ్యేయమన్నారు. ఇందుకోసం రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దేశానికే తలమానికంగా నిలిచే విధంగా ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని గచ్చిబౌలిలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడే విధంగా చూడడం లేదని, ప్రపంచ స్థాయి నగరాలు న్యూయార్క్, ప్యారిస్, టోక్యో, సియోల్ నగరాలతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దాల్సిన అవసరం >>2



హైదరాబాద్‌లో ఆదివారం ఆందోళన చేస్తున్న గ్రూప్ -1 అభ్యర్థులు

# గ్రూప్-1 పరీక్షలకు అంతా రెడీ

## భారీ భద్రతతో 46 సెంటర్లు

## 27 దాకా కొనసాగనున్న పరీక్షలు

## మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభం

## నేడు సుప్రీం కోర్టులో విచారణ

**హైదరాబాద్, అక్టోబరు 20, ప్రభాతవార్త:** నేటి(సోమవారం) నుంచి రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. ఈనెల 27 వరకు మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాల గేట్లను అరగంట ముందే మూసివేయనున్నట్టు అధికారులు ప్రకటించారు. అభ్యర్థులు అరగంట ముందుగానే అభ్యర్థులు పరీక్షాకేంద్రాల్లోకి వెళ్లాలని సూచించారు. మెయిన్స్ పరీక్షలకి 31,383 మంది అర్హత సాధించగా.. వారి కోసం రాష్ట్రంలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి ఇటుతెలంగాణ రాష్ట్రప్రభుత్వం.. అటు తెలంగాణ పబ్లిక్‌సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసింది. ఇప్పటికే పరీక్షల నిర్వహణ కోసం పరీక్షా కేంద్రాలు ఉన్న జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సమీక్షను నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది రాకుండా పరీక్షలను బాగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటిసారిగా నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహించడానికి ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లను చేస్తోంది. ఇప్పటికే రెండు సార్లు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలను నిర్వహించి.. రద్దు చేసిన తరువాత.. మూడోసారి ప్రిలిమ్స్‌ను నిర్వహించగా.. వారిలో నుంచి మెయిన్స్‌కి అభ్యర్థులను ఎంపిక చేశారు. >>2



# పెట్రోలు, డీజిల్ ఆటోలకు ఇక నో పర్మిట్

## ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహకాలు

**హైదరాబాద్, అక్టోబరు 20, ప్రభాతవార్త:** జీరో పొల్యూషన్‌పై తెలంగాణ రవాణా శాఖ దృష్టి సారించింది. పెట్రోల్, డీజిల్ ఆటోల నుంచి పొల్యూషన్ ఎక్కువగా వస్తున్నదనీ, వాటి స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు తీసుకురావాలని ప్రణాళికలు రూపొందిస్తోంది. అందులో భాగంగానే కొత్త ఆటోలకు నో పర్మిట్ నిబంధన తేవాలని భావిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలనీ, ఈ దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. రవాణా శాఖ ఇప్పటికే కొత్త స్క్రాప్ పాలసీకిఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా గడువు తీరిన స్క్రాప్ చేస్తే రాయితీలను ప్రకటించింది. మరో అడుగు ముందుకేసి జీరో పొల్యూషన్‌పై >>2



# రిజర్వేషన్ కేటగిరీకి అన్యాయం జరగదు

## యేడాదికి 2 కోట్ల ఉద్యోగ హామీ ఏమైందో బిజెపి నేతలే చెప్పాలి: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు20, ప్రభాతవార్త:** బిసి బిడ్డగా నేను మీకు భరోసా ఇస్తున్నా సెలక్షన్ ప్రక్రియలో ఎక్కడ రిజర్వుడు కేటగిరికి అన్యాయం జరుగదు అని టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేఖరులలో మాట్లాడుతూ గ్రూప్ -1 పరీక్షపై బిజెపి బిఆర్ఎస్‌లు కుమ్మక్కై లేని పోని అనుమానాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ యువతను తప్పుదారి పట్టిస్తున్నారని ఆవేదన చెందారు. జివో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు నష్టం అనేది కేవలం అపోహనే అని ఆయన కొట్టిపారేశారు. బిజెపి ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రధానమంత్రి హామి ఏమైందో బిజెపి నేతలుచెప్పాలని మహేష్ డిమాండ్ చేశారు. పదేళ్ళలో బిజెపి ప్రభుత్వం ఎన్ని కోట్లమందికి ఉద్యోగాలు ఇచ్చింది ఎంతమంది ఉద్యోగాలు ఊడగొట్టింది లెక్కలు తమ వద్ద ఉందని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి మోడీ ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మేసి లక్షల మంది ఉద్యోగాలు పోగట్టారు. పదేళ్ళలో కెసిఆర్ ప్రభుత్వం కూడా గ్రూప్ -1 నోటిఫికేషన్ ఇవ్వలేదు కనీసం 70వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు ఇంటర్ ఫలితాలు తప్పుల తడకగా ఇచ్చి వందలాదిఆ మంది విద్యార్థుల చావుకు కారణమైంది అని మహేష్‌కుమార్ ఆరోపించారు. పదినెలలలో కూడా పూర్తి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 50వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసింది. పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను జిరాక్స్ సెంటర్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. ప్రస్తుతం చర్చనీయాంశమైన జివో 29 ఫిబ్రవరి నెలలో ఇచ్చారు విపక్షాలు ఇంతకాలం ఎందుకు మాట్లాడలేదని ఆయన ఆరోపించారు. అభ్యర్థులను తప్పుదో పట్టించి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. పరీక్షలు తరుచూ వాయిదాపడితే అభ్యర్థులకు మంచిది కాదు. గ్రూప్ -1 లో 563పోస్టులకు నోటిఫికేషన్‌విడుదలైంది నిరుద్యోగ యువతను ఇబ్బంది పెట్టవద్దని పోలీసులను కోరుతున్నాం. రాజకీయ నేతల కుట్రపూరిత ఉచ్చులో గ్రూప్ -1 అభ్యర్థులు పడొద్దు, ఎవరిపై లాఠీచార్జీ చేయొద్దని పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నాం అని ఆయన అన్నారు. విలేఖరుల సమావేశంలో ఎంపి అనిల్‌కుమార్‌యాదవ్, ఈరవత్రి అనిల్, నూతిశ్రీకాంత్, సత్తుమల్లేశం తదితరులు పాల్గొన్నారు

# అశోక్‌నగర్‌లో మళ్లీ ఉద్రిక్తత

## ఆందోళన చేస్తున్న వారిని తరిమి కొట్టిన పోలీసులు

2

## తీర్పు వచ్చేదాకా ఎగ్జామ్స్ వాయిదా వేయాలని డిమాండ్

# ఫార్మా భూములు తిరిగి రైతులకు ఇవ్వాలి



ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్ పార్టీ సమావేశంలో మాట్లాడతున్న కెటిఆర్

## రూ.10 వేలు సరిపోతాయా.. రూ.15వేలు ఇస్తనంటివి ఎమైనయి?

## దొంగ ప్రభుత్వాలు శాశ్వతంగా ఉండవు: కెటిఆర్

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 20, ప్రభాతవార్త:** ఫార్మసిటి కోసం సేకరించన భూముల్లో ఫార్మ కంపనీలు కాకుండా ఇతర కంపనీలు ఏర్పాటు చేయడానికి నిబంధనలు ఒప్పుకోవని ఆ భూములను తీరిగి రైతులకే ఇవ్వాలని మాజి మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కిగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ప్రమిదా గార్డెన్స్‌లో రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బిఆర్ఎస్ పార్టీ దసరా సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ వర్కిగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హాజరై మాట్లాడుతూ.. కెసిఆర్ రైతు బంధు ఏకరానికి ముష్టి రూ.10వేలు ఇస్తున్నారు..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.15వేలు ఇస్తానంటివి..రెండు పంటలు కాదు మూడు పంటలకు రైతు బంధు ఇవ్వాలంటివి ఇప్పుడు నాట్లు కాదు.. రైతులు వరి పంట కోతలు కోస్తున్నా ఇంకా ఇవ్వకపోతివని ముఖ్యమంత్రి రైవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. వ్యసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తాము ఖరీఫ్ రైతు భరోస ఎగ్గోడుతున్నామని సిగ్గులేకుండ చెప్పిండని విమర్శించాడు. >>2



ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌కు నివేదిక అందజేస్తున్న మంత్రులు దామోదర, శ్రీధర్‌బాబు

# జిఓ 317పై సిఎంకు నివేదిక

## అందజేసిన మంత్రులు దామోదర, శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు20:** జీవో 317పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ వేగం పెంచింది. ఈ మేరకు కేబినెట్ సబ్ కమిటీ ఆదివారం తన తుది నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జీవో 317పై సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా పలువురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షత వహించగా, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు సభ్యులుగా ఉన్నారు. జీవోలో గల సమస్యలపై పలుమార్లు ఉపాధ్యాయ సంఘాలు, ఉన్నతాధికారులు, మేధావులతో కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. అలాగే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఉద్యోగుల అభిప్రాయాలను, వినతులను సేకరించింది. సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీ వివిధ శాఖల ఉన్నతాధికారులతో పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించి తుది నివేదిక పత్రాలను రూపొందించింది. కాగా, 317 జీవోపై తుది నివేదికకు సంబంధించిన పత్రాలను సీల్డ్ కవర్‌లో ఉంచి ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డికి సబ్ కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహ అందజేశారు. కాగా, ఈ జీవోపై సిఎం త్వరలోనే అనుకూల నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

# ఆందోళనలు కనిపించవా?



## కాంగ్రెస్, బిఆర్ఎస్ ఇద్దరి విధానాలు ఒక్కటే

## హిందూ వ్యతిరేక వైఖరితో ముఖ్యమంత్రి రేవంత్

## పరీక్షలకు ఒకే విధానం ఎందుకు లేదు?: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 20 ప్రభాతవార్త:** ముత్యాలమ్మ దేవాలయం ధ్వంసం విషయంపై హిందూ సంఘాలపై పోలీసుల దౌర్జన్య దమనకాండ, అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు, విద్యార్థులపై లాఠీచార్జ్ కాంగ్రెస్ ప్రభుత్వ అహంకార ధోరణికి, దురహంకారానికి నిదర్శనాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగ యువకులు గత వారం రోజులుగా అశోక్‌నగర్‌లో నిరసన కార్యక్రమాలు చేపడితే సిఎం మాటలు చేతలు దాటుతున్నాయే తప్ప సచివాలయం గేటు దాటడం లేదన్నారు. నిరుద్యోగ, రైతాంగం ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలు, ఎన్నికలలో హామీలు ఏ ఒక్కటి సచివాలయం గేటు దాటడం లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా హిందూ వ్యతిరేక వైఖరిని అవలంభిస్తున్నారని ఆరోపించారు. వినాయక, బోనాలు, దేవీ నవరాత్రుల సమయంలో అనేక మందిపై కేసులు పెట్టించారన్నారు. డిజెలు, సౌండ్‌ల మండలాల నిర్వాహకులను వేధించి అక్రమ కేసులు పెట్టించారన్నారు. అన్యమతస్థులకు సంబంధించిన ప్రార్థనా కేంద్రాల్లో ఉదయం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు వస్తున్న శబ్దాలు పోలీసులకు వినిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి వినిపించడం లేదా? కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు అక్కడ మతపరమైన శిక్షణ పొంది అన్య మతస్థులను వేదించే విధంగా హిందూ దేవాలయంపై ఒక వ్యక్తి దాడి చేస్తే సిఎం, కాంగ్రెస్ పార్టీ ఎందుకు ఖండించడం లేదన్నారు. అయోధ్య రామాలయ నిర్మాణం, అమ్మవారినికొలిస్తే, హిందూ దేవుళ్ల పండగలు చేస్తుంటే రాహుల్‌గాంధీకి ఎందుకు బాధ కలుగుతుందన్నారు. ముత్యాలమ్మ దేవాలయం నిరసన కారులపై ఎందుకు అంత పాశవికంగా దాడిచేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. గుడిపక్కనే మోటివేషన్ పేరుతో హిందూ వ్యతిరేక విధానాలకు పాల్పడుతుంటే పోలీసులు, ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఉద్యోగాలను భర్తీ చేసే చిత్తశుద్ది ఉంటే నిరుద్యోగులు, విద్యార్థులతో >>2

# హార్యానా గవర్నర్ దత్తాత్రేయ కాన్వాయ్‌కి ప్రమాదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు20:** హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో దత్తాత్రేయకు ఎలాంటి గాయాలు కాలేదని సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి హరియాణా వెళ్లేందుకు దత్తాత్రేయ శంషాబాద్ ఎయిర్ పోర్టుకు బయల్దేరారు. కిషన్‌గూడ ట్రంపెట్ వంతెన సమీపంలోకి రాగానే... ఓ కారు సడన్‌గా కాన్వాయ్‌లోకి వచ్చింది. దీంతో కాన్వాయ్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడం వలన... కాన్వాయ్ లోని వాహనాలు అదుపుతప్పి ఒకదానినొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటనలోదత్తాత్రేయకు ఎలాంటి గాయాలు కాలేదు. కానీ3కార్లు ధ్వంసం కాగా, సిబ్బందికిస్వల్పగాయాలు అయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసును మోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

# మళ్లీ తుఫాను ముప్పు



## కొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు20:** తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర అండమాన్ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని... దాని ప్రభావంతో రాగల 24 గంటల్లో తూర్పు మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర అండమాన్ ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఈనెల 22 నాటికి పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ బలపడి వాయుగుండంగా మారుతోందని పేర్కొంది. 23వ తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై తుఫానుగా మారుతుందని పేర్కొంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఉత్తర తమిళనాడు తీర >>2



## ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబుతో నందమూరి బాలకృష్ణ అన్‌స్టాపబుల్-4

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 20:** అగ్ర సినీహీరో నందమూరి బాలకృష్ణ బుల్లితెరపై అన్‌స్టాపబుల్ సీజన్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఆహా ఓటిటి ఫ్లాట్‌ఫామ్ వేదికగా ప్రసారమవుతున్న ఈ అన్‌స్టాపబుల్ సీజన్‌కు వచ్చిన స్పందన బాగుంది. ఇప్పటి వరకు మూడు సీజన్‌లను విజయవంతంగా పూర్తి చేసిన నందమూరి బాలకృష్ణ తాజాగా నాలుగో సీజన్ ఎపిసోడ్‌లకు శ్రీకారం చుట్టారు. ఇటీవల అల్లు అర్జున్‌తో ఒక ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తి చేశారు. తాజాగా ఆదివారం ఏపి సిఎం చంద్రబాబునాయుడు హైదరాబాద్‌కు విచ్చేసి సీజన్‌కు 4కు సంబంధించిన ఎపిసోడ్ చిత్రీకరణలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అతిథిగా పూర్తి చేసిన ఈ కార్యక్రమం ఆహాలో ఈనెల 25న రాత్రి 8:30 నిమిషాలకు స్ట్రీమింగ్ కానుంది. ఈ ఎపిసోడ్ బాలకృష్ణ-చంద్రబాబు మధ్య ఎంతో ఆసక్తికరంగా కొనసాగిందని, బాలకృష్ణ రాజకీయాలకు సంబంధించిన ప్రశ్నలు, ఎన్నికలకు ముందు ఉన్న పరిస్థితులు, ఇప్పుడు సిఎం అయిన తర్వాత వచ్చిన మార్పులు ఇలా ఎంతో ఆసక్తికరంగా ఇద్దరి మధ్య సంభాషణ కొనసాగిందని సమాచారం. అందరూ ఈ ఎపిసోడ్ కోసం ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు.

## సీనియర్ ఐఎఎస్ ప్రశాంతికి ఎపి సర్కార్ పోస్టింగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 20:** తెలంగాణ కేడర్ నుంచి రిలీవ్ అయ్యి ఏపీకి వెళ్లిన ఐఏఎస్ అధికారిని ప్రశాంతికి చంద్రబాబు ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రశాంతిని ఏపీ ప్రభుత్వం అటవీ, పర్యావరణ శాఖ అదనపు కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు ఏపీ సిఎస్ నీరబ్ ప్రసాద్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. అటవీ పర్యావరణ శాఖ అదనపు కార్యదర్శిగా ప్రశాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

**ఐఎఎస్‌లకు వెల్కమ్/ఫేర్వెల్ పార్టీ**

క్యాట్ ఆదేశాల మేరకు తెలంగాణను వీడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చేరిన ఐఏఎస్ అధికారులకు, ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చి చేరిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఫేర్వెల్/వెల్కమ్ పార్టీ ఇచ్చింది. తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి శనివారం 19న మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయంలోని 8వ అంతస్తులో సాంప్రదాయ రీతిలో ఐఏఎస్ అధికారులకు శాలువా కప్పి ప్రజెంటేషన్ ఇచ్చి గౌరవించారు.

# కరెంట్‌కు మరో బాదుడు

## సర్వీస్‌లైన్లు, లోడు-చార్జీల మోత

## అడ్డదారి దోపిడీకి డిస్కమ్‌లు ఏర్పాట్లు

**హైదరాబాద్, అక్టోబర్ 20, ప్రభాతవార్త:** వినియోగదారులపై అదనపు భారం మోపేందుకు తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు సిద్ధవుతున్నాయి. ఆదాయం పెంచుకునేందుకు తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు అడ్డదారిలు పడుతున్నాయి. కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీకి సర్వీసు లైన్ చార్జీలు, అదనపు లోడ్ సామర్థ్యం మంజూరికి అదనపు భారం వడ్డించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. కొత్తగా విద్యుత్ కనెక్షన్లు తీసుకునే వారికి అందుకు అవసరమైన లైన్లును, ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి ఉన్న నేపథ్యంలో అందుకయ్యే ఖర్చును వినియోగదారుల నుండి రాబట్టేందుకు లైన్ చార్జీలను తెరముందుకు తీసుకొచ్చాయి. లోడ్ సామర్థ్యం, కనెక్షన్ కేగటిరి, కనెక్షన్ జారీకి డిస్కంలు చేసే సగటు వ్యయం ఆధారంగా కొత్త కనెక్షన్ల చార్జీలను నిర్ణయించనున్నాయి. దీనికి సంబంధి ఈ నెల 24వ తేదీలోగా తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి దీనిపై అభిప్రాయ సేకరణ చేయనుంది. మరోపక్క విద్యుత్ వాడకం లోడును పరిగణలోకి తీసుకుని అదనంగా వినియోగిస్తున్న వినియోగదారులపై భారం మోపనున్నాయి. ఇదుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నాయి. ఏ మేరకు లోడు వినియోగిస్తున్నారనే విషయమై విద్యుత్ పంపిణీ సంస్థలు క్షేత్ర స్థాయిలో పటిష్టమైన పర్యవేక్షణ చేస్తున్నాయి. ప్రతీ ఎలక్ట్రికల్ పోల్, ట్రాన్స్‌ఫార్మర్‌ను జీపీఎస్‌తో అనుసంధానం చేసి వాటిపై ఎంత లోడు వినియోగిఉన్నారనేదాన్ని గుర్తిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎసిలు, వాషింగ్ మిషన్లు, గీజర్లు తదితర విద్యుత్ అధికంగా అవసరమయ్యే పరికరాల వినియోగం భారీగా పెరగడంతో విద్యుత్ కనెక్షన్లపై లోడు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తొలుత ఫ్లాట్లుపై దృష్టిసారించింది. ముందుగా హైదరాబాద్‌లో విద్యుత్ లోడు అంచనా వేసి డిపాజిట్లు కట్టించుకున్నారు.

# బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలకే కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీలు పరిమితం



**వారణాసి, అక్టోబరు 20:** రాష్ట్రంలో సమాజ్‌వాది కాంగ్రెస్ పార్టీలు బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలతోనే కాలం గడిపేసాయని, వారణాసి అభివృద్ధిని నిర్లక్ష్యంచేసాయని ప్రధాని నరేంద్రమోడీ ధ్వజమెత్తారు. ఆదివారం ప్రధానమంత్రి తన సొంత నియోజకవర్గంలో 6700 కోట్ల విలువైన అభివృద్ధిపనులను ప్రారంభించారు. పదేళ్ల క్రితం వరకూ లక్షలకోట్ల రూపాయలు కుంభకోణాలు జరిగాయని హెడ్‌లైన్లలోనే వార్తలు వచ్చేవని, కానీ తర్వాత అభివృద్ధి పనుల వివరాలే బైటికి వస్తున్నాయన్నారు. పదేళ్లక్రితంనాటి వారణాసి పరిస్థితులను చూసి తెలుసుకోవాలని, పదేళ్ల తర్వాత తనహయాంలోని అభివృద్ధిని పరికించాలని ప్రధాని సూచించారు. దశాబ్దాలతరబడి ఢిల్లీలోను, సుదీర్ఘకాలం పాటు ఉత్తరప్రదేశ్‌లోను పాలన సాగించిన పార్టీలు ఏమయ్యాయని, జవాబులు కేవలం అవినీతి, బంధుప్రీతి బుజ్జగింపు రాజకీయాలేనని ప్రకటించారు. సమాజ్‌వాదిపార్టీ అయినా కాంగ్రెస్ పార్టీ అయినా సరే వారణాసికి ప్రాధాన్యం ఇవ్వలేదని బిజెపి ప్రభుత్వంలో మాత్రం సబ్‌కా వికాస్ సూత్రంపైనే ముందుకు నడిచిందని మోడీ గుర్తుచేసారు. కేవలం 125 రోజుల్లోనే 15 లక్షలకోట్ల విలువైన పనులు ప్రారంభించామని, ఇపుడు ఇదే అంశం వారణాసిలోని ప్రతి కుటుంబంలోను చర్చించుకుంటున్నారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ప్రజలకు మెరుగైన జీవనశైలిని అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కొత్తరైల్వేలైన్ల నిర్మాణం జరుగుతోందని, రైల్వేట్రాక్‌లు కొత్తరూట్లలో వస్తున్నాయని, కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణం జరుగుతోందని మోడీ గుర్తుచేసారు. వీటివల్ల యువతకు ఉపాధి పెరుగుతుందని మెరుగైన రవాణా వ్యవస్థలు ఏర్పడతాయని అన్నారు. వారణాసిలోని క్రీడా కాంప్లెక్స్ నుంచి వర్చువల్‌గా 6700 కోట్ల విలువైన అభివృద్ధిపనులనుప్రారంభించారు. అంతకుముందు ప్రధాని ఆర్జే శంకర నేత్రాలయాని ప్రారంభించారు. కంచిమఠ్‌పీఠాధిపతుల ఆధ్వర్యంలో నడిచే ఈ కంటి ఆసుపత్రివల్ల తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని 20 జిల్లాలప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అలాగే బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘర్ సరిహద్దు ప్రాంతాలప్రజలకు కూడా శంకర్ కంటి ఆసుపత్రి సేవలు అందుతాయన్నారు. 16 అభివృద్ధి ప్రాజెక్టులురూ.3200 కోట్లతో చేపట్టినట్లు మోడీ వివరించారు. వారణాసిలోని లాల్‌బహదూర్‌శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయంలో 2870 కోట్లవ్యయంతో రన్‌వేను విస్తరించే పనులను మోడీ ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కొతనత ఎయిర్‌పోర్టు టెర్మినళ్లు వస్తున్నాయన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘర్, బాబత్‌పూర్ ఎయిర్‌పోర్టు, సర్సావా ఎయిర్‌పోర్టు, సహరాన్‌పూర్ ఎయిర్‌పోర్టులు త్వరలోనే అమలుకు వస్తాయన్నారు. విద్యారంగం, వృత్తినైపుణ్యం, క్రీడలు, హెల్త్‌కేర్, పర్యాటకరంగాలకు అత్యధికప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధిపనులు చేపట్టామని అందువల్లనే వారణాసిలో ఇపుడు యువతకు ఉపాధి పెరిగిందని, మౌలికవసౌకర్యాలు పెరిగాయన్నారు. అలాగే పాలి, ప్రాకృత్ భాషలకు ప్రాచీనహోదా కల్పించడంద్వారా సాంచి, సారనాథ్‌లలోని గౌతమబుద్ధుని ప్రవచనాలను గుర్తుకు తెస్తున్నట్లుతెలిపారు.

# బిజెపికి చెక్ పెట్టాలంటే మిత్రపక్షాలకు సీట్లు తక్కువ ఇస్తేనే మేలు

## మహారాష్ట్రలో కాంగ్రెస్ గెలుపు వ్యూహంపై ఉత్తమ్, సీతక్క చర్చలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 20:** మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎఐసిసి అబ్జర్వర్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (మంత్రి), డాక్టర్ అనసూయ సీతక్క(మంత్రి)లు వెల్లడించారు. ఆదివారం ముంబాయిలో మహారాష్ట్ర కీలక నేతలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్, సీతక్కలు మాట్లాడుతూ మహారాష్ట్రలో కాంగ్రెస్‌పై ప్రజల్లో పాజిటీవ్ వేవ్ ఉందని, బిజెపికి చెక్ పెట్టాలంటే మిత్రపక్షాలకు సీట్లు తక్కువ ఇస్తేనే మేలు అంటూ ప్రతిపాదించారు. ఎఐసిసికి ఇదే వివరిద్దామని, కాశ్మీర్, హర్యానా పోలింగ్ తీరును పరిగణలోకి తీసుకుంటే కాంగ్రెస్ మైలేజ్ స్పష్టమవుతుందన్నారు. ఈ మేరకు మిత్ర పార్టీలను ఒప్పించాలని పిలుపునిచ్చారు. నేతలంతా తమ అభిప్రాయాలను వెల్లడించాలని కోరారు.

కాగా, నవంబర్‌లో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తున్నది. ఇందులో భాగంగానే ఆ పార్టీ సీనియర్లు, అనుభవజ్ఞులైన నేతలను రంగంలోకి దింపింది. కొత్త వ్యూహంతో ఎన్నికల్లోకి వెళ్లాలని ఫిక్స్ అయింది. మహారాష్ట్రలో అధికారంలో ఉన్న శివసేన(షిండే) బిజెపి కూటమిని ఓడించాలని నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్ర ఇన్‌చార్జీ రమేష్ చెన్నితాల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్, భుపేష్ బఘేల్, చరణ్ జిత్ చన్నీలతో పాటు మాజీ డిప్యూటీ సిఎంలు టిఎస్ సింగ్ దేవ్, పరమేశ్వరన్‌లు తదితరులు పాల్గొన్నారు.



## చార్‌ధామ్ యాత్ర ముగింపు తేదీలు ఖరారు

### ఉత్తరాఖండ్ పర్యాటక మంత్రి సత్పాల్ మహారాజ్ వెల్లడి

**డెహ్రాడూన్, అక్టోబరు 20:** ఉత్తరాఖండ్‌లో దేవభూమిగా పేర్కొంటున్న చార్‌ధామ్ యాత్ర ముగింపుదశకు వచ్చింది. నాలుగు ధామ్‌ల మూసివేత తేదీలను ఉత్తరాఖండ్‌ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర పర్యాతక శాఖమంత్రి సత్పాల్ మహారాజ్ ఈమేరకు మూసివేసే తేదీలనుప్రకటించారు. నవంబరు ఒకటవ తేదీ గంగోత్రిధామ్ సందర్శన నిలిపివేస్తామని, యమునోత్రిధామ్, కేదార్‌నాథ్‌ధామ్ తలుపులు నవంబరు మూడున మూసివేస్తున్నట్లు వివరించారు. అలాగే తుంగనాథ్‌థామ్ తలుపులు నవంబరు నాలుగున మూసివేస్తారని, నవంబరు 17వ తేదీ ప్రధానమైన బద్రీనాథ్ ధామ్ ద్వారాలు మూసివేస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ఏడాది మే 10వ తేదీనుంచి చార్‌ధామ్ యాత్ర ప్రారంభించారు. ఇటీవలే కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లకు వెళ్లే మార్గాల్లో వర్షం విధ్వంసం సృష్టించింది. దీనితోభక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చార్‌ధామ్ యాత్ర ప్రతి సంవత్సరం ఏప్రిల్‌మేనెలల్లో ప్రారంభిస్తారు. అక్టోబంరు నవంబరు మాసాల్లో ముగుస్తుంది. ఈయాత్రకు వెళ్లే భక్తులు, యాత్రీకులు బయోమెట్రిక్ నమోదు తప్పనిసరి చేసారు. సెప్టెంబరు 30వరకూ చారధామ్ సందర్శకులు 37 లక్షల 91 వేల 205 మంది కాగా గత ఏడాది 56.13 లక్షలమంది వచ్చినట్లు మంత్రి తెలిపారు. ఈ సంఖ్య 2022లో 46.29 లక్షలు కాగా 2019లో 34.77 లక్షలు, 2020, 2021లో కరోనా మహమ్మారి కారణంగా యాత్రీకుల సంఖ్య అంతంతమాత్రంగానే ఉన్నట్లు మంత్రి వివరించారు.

# కివీస్ జట్టుకే పొట్టి ప్రపంచకప్

## 32 పరుగులతో దక్షిణాఫ్రికా ఓటమి



**దుబాయి, అక్టోబరు 20:** ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్ 2024 విజేతగా న్యూజిలాండ్ నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 32 పరుగుల తేడాతో గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. కివీస్ టి20 ప్రపంచకప్‌ను సాధించడం ఇదే మొదటిసారి. తొలుత బ్యాటింగ్‌చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 158 పరుగులుచేసింది. ఈ లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు నష్టపోయి 126 పరుగులకే పరిమితం అయింది. దీనితో కివీస్‌జట్టు విజేతగా నిలిచింది. ఓపెనర్లు లారా వోల్వార్ట్ 27 బంతుల్లో ఐదుఫోర్లుచేసి 33 పరుగులు సాధించింది. తంజ్నిమ్‌బ్రిట్స్ 17 పరుగులు చేసి తొలి వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యం ఇచ్చారు. తర్వాత దక్షిణాఫ్రికా వరుసగా వికెట్లు నష్టపోయింది అన్నేకెబోష్ తొమ్మిది, మారిజేన్‌కాప్ 8, నాడిన్ డిక్లర్క్ ఆరు పరుగులకే ఘోరంగా ఔట్ అయ్యారు. కివీస్ బౌలర్లలో అమేలియా కేర్ 3, రోజ్‌మేరీ మూడు, కార్సన్ ఫ్రాన్ జోనాస్ బ్రూక్‌లు తలో వికెట్‌తీసారు. కివీస్ బ్యాటర్లలో అమేలియా కేర్ 38 బంతుల్లో నాలుగుఫోర్లతో 43పరుగులుచేసింది. బ్రూక్ హాలిడే 28 బంతుల్లో మూడు ఫోర్లుచేసి మొత్తం 38 పరుగులు చేసింది. సుజీబేట్స్ 31 బంతుల్లోనే మూడు ఫోర్లతో 32పరుగులు రాబట్టింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎంలాబా రెండు, అయబొంగ ఖాకా, ట్రయాన్, నాడిన్ డి క్లార్క్ తలో వికెట్ తీసారు.

# జిఓ 29తో బిసి, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు ముంపు

## దాన్ని రద్దు చేయాలి: దాసోజు శ్రవణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 20:** జీవో 29తో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు ముంపు అని వెంటనే జీవోను రద్దు చేయాలని బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. అన్ని వర్గాలకు న్యాయం చేసే జీవో 55ను అమలు చేయాలని కోరారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థులపై లాఠీ చార్జీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం మొండితనం, మూర్ఖత్వంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్నారు. 60 ఉద్యోగాలు యాడ్ చేసి 563 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని, 28,150 మందిని మాత్రమే షార్ట్ లిస్ట్ చేయాలన్నారు. రేవంత్‌రెడ్డి, మహేదర్‌రెడ్డి కలిసి తప్పుడు జీవోను తీసుకువచ్చారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రైవేటు ఎస్టేట్ రిక్రూట్‌మెంట్ కాదని, సిఎం ఎవరి కోసం హడావిడిగా పరీక్షలు పెడుతున్నారని ప్రశ్నించారు. ఎన్టీఆర్ కంటే రేవంత్‌రెడ్డి గొప్పోడు కాదని, ఇచ్చిన జీవోను 24 గంటల్లో ఎన్టీఆర్ వెనక్కి తీసుకున్నారని, సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చేలోపు జీవోను రద్దు చేసి పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. రెండు నెలలు ఆలస్యం అయితే రేవంత్‌రెడ్డికి ఇబ్బంది ఏంటీ? అని నిలదీశారు. రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తోందని ఆరోపించారు. బండి సంజయ్ ఫోన్ చేస్తే రేవంత్‌రెడ్డి ఫోన్ ఎత్తుతారు. ఇద్దరి మధ్య సంబంధం ఏంటి అని ప్రశ్నించారు. ఎక్కడ ఈటల రాజేందర్ హైలెట్ అవుతాడోనని బండి సంజయ్ రోడ్డు ఎక్కారన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే సుప్రీంకోర్టులో సీనియర్ లాయర్లను పెట్టి నిరుద్యోగుల తరఫున వాదించాలని సూచించారు.

# వేడుకలో స్నాక్స్ తిన్న 200 మందికి అస్వస్థత

## అసోంలోని గోలాఘాట్‌లో విషాదం

**గోలాఘాట్(అస్సోం), అక్టోబరు 20:** రాష్ట్రంలోని గోలాఘాట్‌జిల్లా పాస్‌ఘోరియాలోజరిగిన ఒక స్మారక కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తులు తిన్న స్నాక్స్‌కు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. సుమారు 200 మందికిపైగా అస్వస్థతకు లోనయ్యారని తేలింది. రాష్ట్రంలోని గోలాఘాట్ జిల్లా పాస్ ఘోరియా గ్రామానికి చెందిన ప్రదీప్‌గొగోయ్ అనే వ్యక్తి మరణించినతన తల్లి స్మారక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రతువుకు హాజరయిన బంధువులకు సాంప్రదాయకంగా వడ్డించే జల్పాన్ అందించారు. అంటే పఫ్ట్ రైస్; క్రీమ్‌తో కూడిన స్నాక్స్‌ను ఇచ్చారు. అయితే స్నాక్స్ తిన్న కొద్ది సేపటికే అతిథులు అస్వస్థతకు గురవడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. ఫుడ్‌పాయిజన్‌కారణంగా 200 మందివరకూ ఆసుపత్రికి వచ్చినట్లు వైద్యులు తెలిపారు. వీరిలో ఇద్దరిపరిస్థితి విషమంగా ఉందని, వీరిని జోర్హాట్ వైద్యకళాశాలకు తరలించినట్లు తెలిపారు. స్థానిక బిజెపిఎమ్మెల్యే బిస్వజితఫుకాన్ ఆసుపత్రికి వెళ్లి బాధితులనుపరామర్శించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఇతర అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఆహారం విషతుల్యం కావడానికి గల కారణాలుపరిశీలించారని చెప్పారు. హాజరయి గ్రామస్తుల ఇళ్లకు వైద్యబృందాలను కూడా పంపించామని ఎమ్మెల్యే తెలిపారు.

# బిరబిరా గోదావరి-కృష్ణమ్మ పరుగులు

## ఎస్ఆర్ఎస్‌పి 12గేట్లు ఎత్తి 37వేల క్యూసెక్కుల నీరు గోదావరిలో విడుదల

## శ్రీశైలం ఆరు గేట్లు ఎత్తివేత.. 2.17 క్యూసెక్కుల ప్రవాహం జలాశయంలోకి

## ప్రకాశం బ్యారేజి 70 గేట్లు ఎత్తి నీటి విడుదల

**హైదరాబాద్, అక్టోబరు 20, ప్రభాతవార్త:** కర్ణాటక, మహారాష్ట్రాలో కురుస్తున్న వానలతో గోదావరి-కృష్ణా నదలకు వరద పోటెత్తుతోంది. తెలుగునేలపై బిరబిరా గోదావరి కృష్ణమ్మలు పరుగులెత్తున్నాయి. గోదావరి నదిపై నిర్మించిన ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీ ప్రాజెక్టు 12గేట్లను ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఎత్తినారు. ఎస్సారెస్పీ నుంచి మొత్తంగా 46942 క్యూసెక్కుల నీటిని వదలిపెడుతుండగా 12 గేట్లు ఎత్తి 37488క్యూసెక్కులు స్పిల్ వే ద్వారా కిందికి వదిలి పెట్టారు. శ్రీరామసాగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండటంతో గోదావరి నదిలో చేపలు పట్టేందుకు వెళ్ళవద్దని అదే విధంగా పశువుల కాపరులు ఇతర పరివాహక ప్రాంతంలోని ప్రజలు నదిలోకి వెళ్ళ వద్దని నీటిపారుదలశాఖ అధికారులు హెచ్చరించారు. అంతేకాదు సైరన్‌లు కూడా మ్రోగించారు. చేపల వలలు తొలగించాలని ఉదయం నుంచి మత్స్యకారులకు తెలిపారు. ఎస్సారెస్పీలో 1091 అడుగులలో 80.501 టిఎంసిల నీరు అందులో నిల్వ ఉంది. ఎల్ఎండి రెండు గేట్లు ఎత్తి నాలుగువేల క్యూసెక్కుల నీరు స్పిల్‌వే ద్వారా వదులుతున్నారు. మిడ్‌మానేరు, కడెం, శ్రీపాద ఎల్లంపల్లి పూర్తిస్థాయినీటి మట్టం చేరింది. ఎగువ నుంచి 46వేల 942క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి వస్తున్నది. శ్రీశైలం జలాశయంలోకి జూరాల నుంచి 2.28లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. శ్రీశైలం జలాశయానికి కూడా ఆరు గేట్లు ఎత్తి దిగవకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం స్పిల్‌వే నుంచి 1.67లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ గట్లలో విద్యుదుత్పత్తి చేయడానికి 60వేల క్యూసెక్కులు వదులుతున్నారు. శ్రీశైలం పూర్తినీటి మట్టం 885 అడుగులు కాగా అందులో 884.90 అడుగులకు చేసింది. నాగార్జునసాగర్ నిండు కుండలా మారినంది దీనితో 12గేట్లు ఐదు అడుగుల మేరకు ఎత్తి 97వేల క్యూసెక్కులు కిందికి వదులుతున్నారు. 1,38,338 ఇన్‌ఫ్లో సాగర్‌కు ఉంది. విజయవాడ ప్రకాశం బ్యారేజి 70గేట్లను ఎత్తి లక్షా 18వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. భారీ మొత్తం నీటి ప్రవాహం రావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీచేశారు. పులిచింతలకు కూడా 1.18 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా బయటకు ఒకలక్షా 36వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

## 21 కిలోమీటర్ల మారథాన్‌లో కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్, అక్టోబరు 20:** జమ్ముకాశ్మీర్‌లో ఆదివారం ముఖ్య మంత్రి ఒమర్ అబ్దుల్లా తొలి మారథాన్‌లో పాల్గొన్నారు. జెండా ఊపి ఈ కార్యక్రమం ప్రారంభించిన ముఖ్యమంత్రి ఆయనే స్వయంగా మారథాన్‌లో పాల్గొన్నారు. అంతే కాకుండా రెండు గంటల్లోనే 21 కిలోమీటర్లు పరుగులుపెట్టారు. ఇపుడు ఆయన పాల్గొన్న పరుగులు తీస్తున్న ఫోటోలే సోషల్‌మీడియాలో దర్శనమిస్తున్నాయి. 13 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న దాదాపు రెండువేల మంది అథ్లెట్లు స్థానికంగా 35 మంది క్రీడాకారులు ఇందులోపాల్గొన్నారు. కశ్మీర్‌లోయలో జరిగిన తొలి అంతర్జాతీయ ఈవెంట్ కావడంతోముఖ్యమంత్రి ఎక్కువ శ్రద్ధచూపించారు. మారథాన్‌లో చురుకుగా పాల్గొన్న ఒమర్ అబ్దుల్లా అందరి దృష్టిని ఆకర్షించారు. శిక్షణ ప్రణాళికలేకుండానే తాను ఈ మారథాన్‌లో పాలుపంచుకున్నట్లు ఎక్స్ మీడియాలో ఆయన పోస్టుచేసారు. నాజీవితంలో 13 కిలోమీటర్లకంటే ఎక్కువ దూరం వెళ్లలేదని, అదికూడా ఒక్కసారి మాత్రమేనన్నారు. ఈరోజు అనేకమంది మారథాన్‌లో పాల్గొన్నారని, ఎంతో ఉత్సాహంగా వారితో సాగానని ఒమర్ సోషల్ మీడియాలో తన అనుభవాన్ని వివరించారు. భవిష్యత్తులో కాశ్మీర్ మారథాన్‌ప్రపంచంలోనే అత్యుత్తమ క్రీడా ఈవెంట్లలో ఒకటిగా మారుతుందని అన్నారు. జమ్ముకాశ్మీర్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం ఆధ్వర్యంలోజరుగుతున్న మొట్టమొదటి అంతర్జాతీయ క్రీడా ఈవెంట్ కావడంతో ఒమర్ అబ్దుల్లా తానే పాల్గొనాలని భావించారు. అందుకే ఆయన మారథాన్‌లో పాల్గొని ఇతరులకు మరింతప్రోత్సాహం ఇచ్చారు.



# వేలంలో తొమ్మిది మిలియన్ డాలర్లు పలికిన 237 యేళ్లనాటి అమెరికా రాజ్యాంగపత్రం

**నార్త్‌కరోలినా, అక్టోబరు 20:** అమెరికా రాజ్యాంగంలోని అత్యంత అరుదైన రాజ్యాంగపత్రం ఒకటి ఆన్‌లైన్ వేలంలో తొమ్మిది మిలియన్ డాలర్లు పలికింది. నార్త్‌కరోలినాలోని యాష్‌విల్లీలోనిర్వహించిన వేలంలో బ్రంక్ అనే ఆన్‌లైన్ వేలం సంస్థ నిర్వహించిన వేలంలో ఈ అరుదైన రాజ్యాంగపత్రానికి 90 లక్షల డాలర్లుపలికింది. 50 వేల డాలర్లనుంచి ప్రారంభించిన ఆన్‌లైన్ వేలం తొమ్మిది మిలియన్ డాలర్లవరకూ పెరిగింది. మొత్తంగా 62 బిడ్లు దాఖలయినట్లు బ్రంక్ ఆక్షన్స్ ప్రకటించింది. అమెరికా రాజ్యాంగ ముసాయిదా పూర్తిచేసిన తర్వాత ఈ అరుదైన పత్రాన్ని ముద్రించారని, 1787 సెప్టెంబరు 28వ తేదీ న్యూయార్క్‌లో ఈ రాజ్యాంగపత్ర ముద్రణ జరిగిందని వేలం సంస్థ ప్రకటించింది. ఆనాటి కాంటినెంటల్ కాంగ్రెస్ సెక్రటరీ ఛార్లెస్ థామస్సన్ ఆధ్వర్యంలో ఈరాజ్యాంగపత్రాల ముద్రణ జరిగింది. సుమారు 100కుపైగా కాపీలు ముద్రించారని వేలం సంస్థ వివరించింది. వీటిలో ఏడు డాక్యుమెంట్లు వివిధ రంగాల నిపుణులు సొంతంచేసుకున్నట్లు తేలింది. అలాగే ది జర్నల్ ఆఫ్‌ది కన్వెన్షన్ ఆఫ్ నార్త్‌కరోలినా హిల్స్‌బరో 1788 డాక్యుమెంట్‌ను కూడా వేలం వేసినట్లు బ్రంక్స్ ఆక్షన్ వెల్లడించింది. రెండువారాలపాటు ఈరాజ్యాంగ ముసాయిదాపై విస్తృత స్థాయి చర్చలు జరిగిన తర్వాత చట్టసభలు ఆమోదించాయి. ఈ రాజ్యాంగం ద్వారానే అమెరికా ఫెడరల్‌ప్రభుత్వానికి విస్తృత అధికారాలు దఖలుపడ్డాయి. 2021లో కూడా రాజ్యాంగంలోని మిగిలిన 14 కాపీలను కాంటినెంటల్ కాంగ్రెస్ ముద్రించింది. రాజ్యాంగ కన్వెన్షన్ ప్రతుల వివరాలను న్యూయార్క్‌లోని సోత్‌బై కంపెనీ వేలం వేసింది. ఆనాటి వేలంలో ఈ మిగిలి ఉన్న ప్రతులన్నింటికీ 43.2 మిలియన్ డాలర్ల ధరలు పలికినట్లు బ్రంక్ ఆక్షన్స్ సంస్థ వెల్లడించింది.

కాగా ప్రస్తుతం జరిగిన వేలం 237 ఏళ్ల నాటి రాజ్యాంగపత్రానికి సంబంధించినదని నార్త్‌కరోలినా సంస్థ ప్రకటించింది. ఆనాటి అమెరికాలోని 13 రాష్ట్రాలకు సైతం వీటిని పంపిణీచేసారు. రాజ్యాంగ కన్వెన్షన్‌లోజరిగిన నిర్ణయాలన్నింటినీ క్రోడీకరించి రూపొందించిన ముసాయిదాను ఆనాటి ఫెడరల్ ప్రభుత్వ చట్టసభలు ఆమోదించాయి. ఇపుడు మరికొన్ని కీలక పత్రాలు కూడా వేలానికి వస్తున్నాయి. 1776లోని మొట్టమొదటి ముసాయిదా పత్రం ఆర్టికల్స్ ఆఫ్ కాన్ఫెడరేషన్, 1788 జర్నల్ ఆఫ్‌ది కన్వెన్షన్ ఆఫ్ నార్త్‌కరోలినాకు సంబంధించిన పత్రాలు కూడా వేలానికి వస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఆనాడు ఈ రాజ్యాంగాన్ని ఆమోదించడంద్వారా రాష్ట్రాలకంటే అమెరికా ప్రభుత్వ చట్టసభలకు విస్తృత అధికారాలను దఖలుపరిచినట్లు ఈ పత్రాలు స్పష్టం చేస్తున్నాయి.

